క్లుప్తంగా

జాతీయ లోక్‌అదాలత్‌లో 74 కేసుల పరిష్కారం

బంటుమిల్లి: స్థానిక న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 74 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో లోక్‌అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ కారణంగా కక్షిదారులకు లభించే సౌకర్యాలపై అవగాహన కలిగించారు. అనంతరం బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల్లో వివిధ సెక్షన్లకు చెందిన 74 కేసులను చైర్మన్ విచారణ చేసి పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వై.సోమశేఖర్, ఇల్లూరి సుబ్బారాయుడు, తమ్మన సురేష్, ఎస్.సురేష్, ఎస్‌ఐలు గణేష్‌కుమార్, పైడిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు



మచిలీపట్నంటౌన్: బెరాక మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మల్కా పట్నంలోని లీడ్స్ కేర్ సపోర్ట్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. బెరాక మినిస్ట్రీస్ చైర్మన్ బీఎస్ కిరణ్ పాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయం కోసం ఎదురుచూసే చిన్నారులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో బెరాక మినిస్ట్రీస్ డైరెక్టర్ నాగిశెట్టి డానియల్, మెడికల్ ఆఫీసర్ వాసుదేవరావు, లీడ్స్ కేర్ సపోర్ట్ సెంటర్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత లీడ్స్ కేర్ సపోర్ట్ సెంటర్లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రాజగోపురం ప్రారంభోత్సవం

గూడూరు: గూడూరులోని శ్రీ వేంకటాచల స్వామి ఆలయంలో నిర్మించిన రాజగోపుర శిఖరాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. వేద మంత్రాల మధ్య ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు తిమ్మరాజు కృష్ణకాంత్, కార్యనిర్వాహణ అధికారి టి.వి.వి.మోహనరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో గోదాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు పోతన లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచి పోతన రామోజీ, తదితరులు పాల్గొన్నారు. రాజగోపుర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

కొత్త బాక్సులకు అదనపు వసూళ్లు!

సెట్ టాప్ బాక్స్ ఉచితమే
అంటున్న సిటీ కేబుల్ మేనేజర్

మచిలీపట్నంటౌన్: నగరంలో కొందరు సిటీ కేబుల్ ఆపరేటర్లు సెట్ టాప్ బాక్స్‌లకు డబ్బు వసూలు చేస్తున్నారు. మచిలీపట్నం కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో నగరంలోని వినియోగదారులకు ఎంసీపీఎల్ సెట్ టాప్ బాక్సులను ఏర్పాటు చేసి కేబుల్ ప్రసారాలను అందిస్తున్నారు. వినియోగదారులు అప్పట్లో కొంత సొమ్మును చెల్లించి బాక్సులు తీసుకున్నారు. ప్రస్తుతం సిటీ కేబుల్ యాజమాన్యం జీటీపీఎల్ కంపెనీతో అనుసంధానం పెట్టుకుని ఆ కంపెనీ సెట్ టాప్ బాక్సులను బిగించే పనులను నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ ముమ్మరంగా నిర్వహిస్తోంది. కొంతమంది కేబుల్ ఆపరేటర్లు వినియోగదారుల వద్ద ఉన్న పాత ఎంసీపీఎల్ బాక్సులను, రిమోట్‌లను తీసుకుని కొత్తవి బిగిస్తున్నారు. సమస్య ఇక్కడే ప్రారంభమవుతోంది. గతంలో సొమ్ము చెల్లించి బాక్సులను తీసుకున్న వినియోగదారుల నుంచి ప్రస్తుతం కొత్త బాక్సు బిగించి డబ్బులు వసూలు చేస్తుండటంతో లబోదిబోమంటున్నారు. సాధారణ బాక్స్‌కు రూ. 200, హెచ్‌డీ బాక్స్‌కు రూ. 100 చొప్పున ఆపరేటర్లు వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లపై సిటీకేబుల్ మేనేజర్ విభాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా నూతన జీటీపీఎల్ సెట్ టాప్ బాక్సులను ఉచితంగానే బిగించాలని, డబ్బులు వసూలు చేయవద్దని ఆపరేటర్లకు సూచించామన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో హైడ్రామా!

- నందిగామ డబ్ల్యూయూఏ ఎన్నిక వాయిదా
- నామినేషన్ పత్రాలు లాక్కొనేయత్నం
- ఎన్నికల అధికారికి, ఓడిన అభ్యర్థి ఎడమ చేతులకు గాయాలు
- ఒక టీసీలో గొడవ జరిగితే మొత్తం వాయిదా వేయడంపై సర్పంచి ఆగ్రహం



నందిగామలో జరిగిన ఘటనపై ఆరా తీస్తున్న పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్

పెడన: పెడన మండలంలో నీటి సంఘాల ఎన్నికల్లో హైడ్రామా నెలకొంది. దీంతో నందిగామ డబ్ల్యూయూఏ ఎన్నిక వాయిదా పడింది. మండలంలో ప్రాదేశిక నియోజకవర్గ నీటి సంఘాల ఎన్నికలు శనివారం మండలంలోని పది పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎన్నికలను బహిష్కరించడంతో కూటమి అభ్యర్థులు బరిలో నిలిచి 108 టీసీలను ఏకగ్రీవం చేసుకున్నారు. 12 టీసీలు వాయిదా పడ్డాయి. పెడన మండలంలో నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 12 టీసీలకు సంబంధించి టీడీపీలోనే రెండు వర్గాలు అభ్యర్థులను బరిలో నిలిపాయి. నందిగామ సర్పంచి బొడ్డు చినబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్ రెండు వర్గాలుగా అభ్యర్థులను బరిలో నిలిపారు. నందిగామ వాటర్ యూజర్స్ అసోసియేషన్ 111లోని సబ్ డివిజన్ మూడో నంబరు ప్రాదేశిక నియోజకవర్గ (టీసీ) ఎన్నికల అధికారి, వీఆర్వో జి.మధుశేఖర్ చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను ఓడిన అభ్యర్థి పామర్తి వెంకటేశ్వరరావు లాక్కునే ప్రయత్నించారు. ఘటనలో మధుశేఖర్ ఎడమ చేతిపై గాయమవ్వగా, వెంకటేశ్వరరావు ఎడమచేతి వేలికి గాయమైంది. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. ఎన్నికల ప్రాంగణంలో జరిగిన సంఘటనతో నందిగామలోని 12 టీసీల ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు.

పెనుగులాటలో గాయాలు

తంతు పూర్తికావడంతో అందరూ వెళ్లిపోగా ఎన్నికల అధికారి మధుశేఖర్ నామినేషన్ పత్రాలను సరిచేసుకుంటున్న క్రమంలో తిరిగి వెనక్కు వచ్చిన పామర్తి వెంకటేశ్వరరావు మధు వద్ద ఉన్న నామినేషన్ పత్రాలు లాక్కోవడానికి ప్రయత్నించారు. పెనుగులాటలో మధుశేఖర్, వెంకటేశ్వరరావు ఇద్దరి చేతులకు గాయాలయ్యాయి. అధికారులు వీరిని ఆస్పత్రికి తరలించారు. దీంతో పోలింగ్ కేంద్రం అధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్ కుమార్ నందిగామలోని 12 టీసీల ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఒక టీసీలో గొడవ జరిగితే మిగిలిన టీసీలను వాయిదా వేయడం ఏమిటంటూ నందిగామ సర్పంచి బొడ్డు చినబాబు అధికారులను నిలదీశారు. అదీ కూడా ఓటింగ్ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత ఈ గొడవ జరిగిందని, వాయిదా వేయడం పద్ధతి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు మేం వాయిదా వేశామని అనిల్‌కుమార్ వివరణ ఇచ్చారు.

ఫలించని రాజీ యత్నాలు

తొలుత టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్ తదితరులు నందిగామ సర్పంచి బొడ్డు చినబాబుతో చేసిన రాజీ యత్నాలు చేసినా ఫలించలేదు. ఒక టీసీలో పామర్తి వెంకటేశ్వరరావు, పామర్తి బ్రహ్మయ్య పోటీకి నిలబడ్డారు. పత్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ చేతులు ఎత్తే పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. బ్రహ్మయ్యకు పది ఓట్లు రాగా వెంకటేశ్వరరావుకు రెండు ఓట్లు వచ్చాయి.

డబ్ల్యూయూఏ ఏకగ్రీవం



కె.కొత్తపాలెంలో ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీవిద్య



నాగాయలంక మండలం ఏటిమొగలో ఎన్నికల నిర్వహణ దృశ్యం

కోనేరుసెంటర్: బందరు మండలంలో నీటి సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలో మొత్తం 13 నీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం 13 సంఘాలను దక్కించుకుంది. నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించటంతో కూటమికి ఈ ఫలితాలు లభించాయి. 13 సంఘాలకు సంబంధించి 11 సంఘాలను టీడీపీ, మిగిలిన రెండు సంఘాలకు జనసేన పార్టీల తరపున అభ్యర్థులు ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

- అవనిగడ్డ: అవనిగడ్డ మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మోదుమూడి, వేకనూరు, అశ్వరావుపాలెం సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.
- నాగాయలంక: మండలంలోని తొమ్మిది నీటి సంఘాల్లో తలగడదీవి నీటి సంఘం నిలిచిపోగా మిగిలిన ఎనిమిది నీటిసంఘాలు(డబ్ల్యూయూఏ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.
- మోపిదేవి: సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం మండలంలో ఏకగ్రీవంగా జరిగాయి.
- కోడూరు: మండలంలోని ఎనిమిది నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాలను సంబంధిత పోలింగ్ అధికారులు అందించారు. ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఈఓపీఆర్డీ నాగరేవతి ఇతర అధికారులు పాల్గొన్నారు.
- ఘంటసాల: మండల పరిధిలోని ఆరు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు తహసీల్దార్ బి.వి జయ ప్రసాద్ తెలిపారు.
- బంటుమిల్లి: మండల పరిధిలో 8 నీటి సంఘాలుండగా పెందుర్రు నీటి సంఘం ఎన్నిక వాయిదా పడటంతో మిగిలిన ఏడు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా అధికార టీడీపీ బలపరచిన వ్యక్తులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- గూడూరు: మండలంలో ఆరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటి అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- కృత్తివెన్ను: మండల పరిధిలోని ఎనిమిది నీటి సంఘాలు ఏకగ్రీవాలు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో డీసీ చైర్మన్ ఎన్నిక జరగనుంది.

కూటమిలో వర్గ విభేదాలు

పెందుర్రులో ఘర్షణ వాతావరణం



పెందుర్రు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన నామినేషన్ పత్రాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు-128 నీటి సంఘం ఎన్నిక టీడీపీ, జనసేన నాయకుల వర్గ విభేదాల నేపథ్యంలో వాయిదా పడింది. మండలంలో 8 సంఘాలు ఉండగా పెందుర్రు గ్రామంలోని 128 సంఘంలో కూటమి పార్టీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణ ఏర్పడి కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెడన సీఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు గణేష్‌కుమార్, పైడిబాబు ఇరు వర్గాలకు సర్దిచెప్పి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ జరుగుతుండగా మునిపెడ బ్రాంచి కాలువ పరిధిలోని రైతులు తమ ఓటర్లను నామినేషన్ వేసేందుకు రానివ్వడంలేదంటూ ఎన్నికల కేంద్రంలోకి వెళ్లి ఆందోళన చేసి ఎన్నికల అధికారి ఎస్‌కేవీడీ ప్రసాదరావుతో ఘర్షణకు దిగారు. అప్పుడు గుర్తు తెలియన వ్యక్తి 11, 12 సెగ్మెంట్లకు చెందిన నామినేషన్ పత్రాలను చించేశాడు. పోలీసులు ఇరు వర్గాలకు సర్దిచెప్పి బయటకు పంపారు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎన్నికల అధికారి దుర్గాప్రసాదరావు బయటకు వచ్చి పెందుర్రు-128 నీటి సంఘం ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఒకవర్గం వాయిదా పడటంతో ఆనందంగా ఉండగా, మరో వర్గం.. ఎన్నికను ఎందుకు వాయిదా వేస్తున్నారో చెప్పాలన్నారు.

భగ్గుమన్న వర్గ రాజకీయం

పెందుర్రు గ్రామంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నిక కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీల్లో వర్గ విభేధాలు భగ్గుమనడానికి కారణమైంది. ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు రెండు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. జనసేన అధిష్టానం ఎన్నికను టీడీపీకి వదలాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే జనసేన నేతలు ఆ ఆదేశాలను బేఖాతారు చేశారు. ఈ క్రమంలో టీడీపీ బలపరచిన వెంట్రపాటి సురేష్ జనసేన అభిమాని అయినా వర్గ రాజకీయంలో టీడీపీ నాయకుల తరపున నామినేషన్ వేశాడు. అతనికి గ్రామ భూస్వామి మాజీ సర్పంచ్ బండారు సత్యనారాయణ(కొండ) కుటుంబం మద్దతు తెలిపింది. దీంతో జేఎస్పీ నేతలు ప్రత్తి శాంతారావు మనవడు, కొండ మేనల్లుడు వరప్రసాదు(వర్మ)ను పోటీగా నామినేషన్ వేయించారు. ఈ క్రమంలో సురేష్‌కు మద్దతు తెలపని టీడీపీలోని కొంత మంది నాయకులు వర్మకు, జేఎస్పీలో వర్మ అంటే ఇష్టంలేని కొంత మంది నాయకులు సురేష్‌కు మద్దతు తెలపడంతో కూటమి రాజకీయం రసకందాయమైంది. ఇదిలా ఉండగా నీటి సంఘాల ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని జెఎస్పీ పెందుర్రు నేత సుందరయ్య ఆరోపించారు.

పైడమ్మ జాతర ప్రారంభం



పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పైడమ్మవారు ఈ నెల 2వ తేదీన రంగుల కోసం మచిలీపట్నం ఊరేగింపుగా వెళ్లిన విషయం తెల్సిందే. అమ్మవారు తిరిగి శనివారం మచిలీపట్నంలో బయల్దేరడంతో మహోత్సవాలు ప్రారంభమైనట్లుగా దేవదాయశాఖ ఈవో టీవీవీ మోహనరావు తెలిపారు. అమ్మవారు ఊరేగింపుగా మచిలీపట్నం పురవీధుల్లో తిరుగుతూ పెడనకు శనివారం అర్ధరాత్రి చేరుకుంటారని పేర్కొన్నారు. పెడనలో ఊరేగింపుగా అమ్మవారి పుట్టినిల్లు, మెట్టినిల్లు వారు నైవేద్యాలను సమర్పించనున్నారని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలలోపు అమ్మవారు ఆలయప్రవేశం చేస్తారని ఈవో తెలిపారు. ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ఊపందుకుంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రపౌర్ణమిని పురస్కరించుకుని పైడమ్మ అమ్మవారి ప్రతిరూపమైన ముత్యాలమ్మ ఘటం గుడివద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

గుడివాడ టౌన్:క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక పటిష్టతకు దోహద పడతాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ 44వ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం నిర్వహించారు. వివిధ వయసు గ్రూపులకు పోటీలు జరిగాయి. 100, 200, 800, 1500, 5కె పరుగుపందెం, త్రోబాల్, షాట్‌పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, నడక వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మడకా ప్రసాద్, మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి ఎంవీ ప్రసాదు, అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాదు, ఆర్గనైజర్ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు!

బందరులో ఎనీటైం మద్యం

- పగలు, రాత్రి బార్లా తెరిచి ఉంటున్న బార్‌లు
- ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ అధికారులు



కోనేరుసెంటర్: మచిలీపట్నంలో మద్యం వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యాన్ని ఏరులై పారిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. సమయంతో సంబంధం లేకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు తెలిసే ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

వేళాపాళా లేదు

నియోజకవర్గంలో మొత్తం 17 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో ఎనిమిది వైన్ షాపులు, 9 రెస్టారెంట్ అండ్ బార్‌లు ఉన్నాయి. వీటిలో టౌన్‌కు సంబంధించి ఎనిమిది బార్‌లు, రూరల్‌లో ఒకటి ఉండగా రూరల్ ప్రాంతంలోని చిన్నాపురం, సుల్తానగరం, తాళ్లపాలెం గ్రామాల్లో మూడు షాపులు నగరంలో ఐదు షాపులు నడుస్తున్నాయి.. బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అమ్మకాలు జరపాలి. నగరంలోని కొంత మంది లిక్కర్ వ్యాపారులు ఎక్సైజ్ నిబంధనలకు నీళ్లు వదిలేశారు. బార్‌లను పగలు, రాత్రి తేడా లేకుండా నడుపుతున్నారు. 24 గంటలు లిక్కర్ అమ్ముతూ మందుబాబుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు.

నిద్రపోతున్న నిఘా

మద్యం దుకాణాలపై కన్నేసి ఉంచాల్సిన ఎక్సైజ్ అధికారులు నిద్రపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళ్లెదుటే అమ్మకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవటంతో వ్యాపారులతో సంబంధిత అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మచిలీపట్నంలో విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం విక్రయాల తతంగమంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే విమర్శలు ఎక్సైజ్ అధికారులపై వస్తున్నాయి.

ఫిర్యాదు అందితే కచ్చితంగా చర్యలు

సమయంతో సంబంధం లేకుండా విక్రయాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు అందితే కచ్చితంగా చర్యలకు ఉపక్రమిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే ఎవరినీ ఉపేక్షించం. ఇప్పటికే పోర్టు రోడ్డులోని ఓ రెస్టారెంట్ అండ్ బార్‌పై కేసు నమోదు చేశాం. లక్షల్లో జరిమానా విధించాం. సమయపాలన పాటించకుండా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తాం. ఎవరినీ వదిలేది లేదు.

– కె.శేఖర్, ఎక్సైజ్ సీఐ, మచిలీపట్నం

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విశ్వభారతి హైస్కూలులో కొవ్వొత్తులతో ప్రదర్శన



చిన్నారుల నృత్యప్రదర్శన

పెడన: మానవ జీవితానికి ఏసు క్రీస్తు బోధనలు అవసరమని ప్రతి ఒక్కరూ ప్రేమ, క్షమ గుణాలను కలిగి ఉండాలని పాస్టర్ బి.జయరాజు అన్నారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సంస్కృతిక ప్రదర్శనలు, లఘు నాటికలు, పాటలు పాడటం వంటి కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ క్రిస్మస్ చెట్టు, పశువుల పాకలో ఏసు జననాన్ని తెలియ జేశారు. వేడుకల్లో పాస్టర్ ఇజ్రాయేల్, పుట్టి కృష్ణ ప్రసాద్, సతీష్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ గౌరీ ప్రసాద్, డ్యాన్స్ మాస్టర్ మధు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దివ్యజ్యోతి

అవనిగడ్డ: స్థానిక శివాలయంలో శనివారం రాత్రి దివ్యజ్యోతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు కర్పూరజ్యోతిని వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు చేసిన అరుణాచలం శివుని నామస్మరణంతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమాన్ని మహిళా విభాగం నాయకురాలు చెన్నగిరి మల్లికాంబ, కొల్లిపర రాధాకృష్ణ, విస్సంశెట్టి శ్రీనివాసరావు, దేసు శేషు, కోడూరు పవన్ పర్యవేక్షించారు.



ముగిసిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న 12-డే అడ్వాన్డ్స్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి వివరాలు వెల్లడించారు. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏ డీప్ డ్రైవ్‌ఇంటూ అటానమస్ వెహికల్స్ థియరీ టూ ప్రాక్టీస్‌పై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఈనెల 2వ తేదీ నుంచి ఇచ్చామన్నారు. దేశంలో వివిధ ఐఐటీల్లో పని చేసే నిపుణులు, స్టేట్ యూనివర్సిటీ వక్తలు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ, రిమోట్ పైలెట్ సెన్సింగ్, ఫోరెన్సిక్స్, ఏఐ విజన్ ఇలా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, దాని ప్రాముఖ్యతను వివరించారని పేర్కొన్నారు. వివిధ కాలేజీలకు చెందిన 50 మంది అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు.

వైభవంగా ఏకశిలా నాట్య స్థూప ప్రతిష్ఠ

కూచిపూడి(మొవ్వ):నాట్య క్షేత్రం కూచిపూడిలో శనివారం వేకువజామున పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాంప్రదాయ మంగళ వాయిద్యాల నడుమ నాట్యాచార్యులు, యువ కళాకారుల పర్యవేక్షణలో 50 అడుగుల ఏక శిలానాట్య స్థూపాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీ గణపతి హోమాన్ని దేవాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్, ప్రవాస భారతీయులు డాక్టర్ వేదాంతం వెంకట నాగచలపతి రావు (వెంకు), రాష్ట్రపతి అవార్డు గ్రహీత నాట్యాచార్య, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతారవిబాల కృష్ణ,శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పాలక మండలి అధ్యక్షుడు కావూరి భానుమూర్తి, కూచిపూడి నాట్య హెరిటేజ్ సొసైటీ నిర్వాహకులు, యువ నాట్యాచార్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో టాయిలెట్ల నిర్మాణం

గుడ్లవల్లేరు: జిల్లాలో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.60.48 లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ తెలిపారు. 'సాక్షి'తో ఆమె ఫోన్లో మాట్లాడారు. ఒక్కో టాయిలెట్‌ను రూ.36 వేల నిధులను ఖర్చు చేసి అంగన్‌వాడీల వద్ద జిల్లాలో 168 నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

గుడివాడ టౌన్:వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ ప్రజల ప్రయోజనం కోసం నాలుగు ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. చేపలమార్కెట్ వద్ద రెండు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గోర్జి సత్యనారాయణ, ఆసుపత్రి ఆర్ఎంఓ కృష్ణదొర, పంచకర్ల వెంకట్, జి. ప్రభాకరరావు, వి. శ్రీనివాసరావు, పూడి సుధాకర్, బ్రాహ్మజీ, తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో ఇంధన పొదుపు

ఉయ్యూరు: సోలార్ వినియోగంతో ఇంధన పొదుపు సాధ్యమవుతుందని విద్యుత్ శాఖ ఈఈ కృష్ణనాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరులో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై ప్రజలు దృష్టిసారించాలన్నారు. సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా అవ్వడంతో పాటు ఆదాయం సమకూరుతుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. డీఈఈ హేమకుమార్, ఏఈలు బసవశాస్త్రులు, నాగేశ్వరరావు, దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.